సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




శనివారం 18 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 320 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్



## నారీశక్తి వందన చట్టం సవరణకు మద్దతు ఇవ్వాలని లోక్‌సభలో విజ్ఞప్తి

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18, ప్రతినిధి: పార్లమెంటులో ప్రస్తుతం చర్చలో ఉన్న నారీశక్తి వందన చట్టం సవరణపై లోక్‌సభలో కీలక చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గతంలో చట్టంపై నెలకొన్న సందేహాలు, అపోహలను తొలగిస్తూ ప్రతి అంశంపై సమగ్ర వివరణ ఇచ్చినట్లు తెలిపారు. మహిళలకు నిర్ణయ ప్రక్రియలో తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. దేశంలో నాలుగు దశాబ్దాలుగా మహిళా రిజర్వేషన్‌పై రాజకీయ చర్చలు కొనసాగినప్పటికీ, ఇప్పుడు దేశం యొక్క అర్ధ భాగమైన మహిళలకు వారి హక్కులు అందాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. మహిళా శక్తి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ఈ సవరణ ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. అన్ని రాజకీయ పార్టీలు ఆలోచించి, సున్నితంగా నిర్ణయం తీసుకుని మహిళా రిజర్వేషన్‌కు అనుకూలంగా ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కోట్లాది మహిళల ఆశలు, ఆకాంక్షలు ఈ నిర్ణయంపై ఆధారపడి ఉన్నాయని సభలో పేర్కొన్నారు.



## మహిళా రిజర్వేషన్ బిల్లుపై లోక్‌సభలో చర్చ

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18, ప్రతినిధి: మహిళలకు రిజర్వేషన్ కల్పించే అదృష్టం తమకు దక్కిందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లోక్‌సభలో పేర్కొన్నారు. సభలో 56 మంది మహిళా సభ్యులు ఉండటం సంతోషకరమని ఆయన తెలిపారు. మహిళా సాధికారత లక్ష్యంతో బిల్లును ప్రవేశపెడుతున్నామని, సభ నియమ నిబంధనలకు అనుగుణంగా చర్చ కొనసాగుతోందని చెప్పారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగిందని, అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించడాన్ని కొందరు ఇండి కూటమి సభ్యులు వ్యతిరేకించారని ఆయన వ్యాఖ్యానించారు.



## తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్రానికి విజ్ఞప్తి

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18, ప్రతినిధి: యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో కలిసి, తెలంగాణలో యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని వివరించారు. గత ఆరు యాసంగి సీజన్లలో సీఎంఆర్ సరఫరా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని తెలిపారు. ఈ యాసంగిలో సుమారు 90 ఎల్ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని పేర్కొన్నారు. ఇందులో 30 ఎల్ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరాకు రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. అదేవిధంగా 2014–15 వర్షాకాల పంటకు సంబంధించిన రూ.1,468.94 కోట్ల బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అలాగే పోషకాహార బియ్యం (FRK) పంపిణీని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్‌లో పునఃప్రారంభించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ఆహార శాఖ అధికారులు పాల్గొన్నారు.



## హర్మూజ్ జలసంధిపై ఇరాన్ కీలక ప్రకటన చమురు మార్కెట్లలో భారీ మార్పు

సందేశం టైమ్స్, అంతర్జాతీయ డెస్క్, ఏప్రిల్ 18: హర్మూజ్ జలసంధి (Strait of Hormuz) పై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. ఈ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ప్రకటించిన ఇరాన్, చమురు నౌకల రాకపోకలను ఇకపై అడ్డుకోబోమని స్పష్టం చేసింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన మార్గంగా భావించే హర్మూజ్ జలసంధి ద్వారా ప్రతిరోజూ భారీ మొత్తంలో ముడిచమురు ఎగుమతులు జరుగుతాయి.ఇరాన్ తాజా నిర్ణయంతో అంతర్జాతీయ మార్కెట్లలో వెంటనే ప్రభావం కనిపించింది. అనిశ్చితి తగ్గడంతో ముడిచమురు ధరలు గణనీయంగా పడిపోయాయి. గత కొన్ని రోజులుగా జలసంధి పరిసరాల్లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు సరఫరాపై ఆందోళనలు పెరిగినప్పటికీ, తాజా ప్రకటనతో మార్కెట్లు ఊరట చెందాయి.నిపుణుల అభిప్రాయం ప్రకారం, హర్మూజ్ మార్గం తెరిచి ఉండటం వల్ల ప్రపంచ ఇంధన సరఫరా స్థిరంగా కొనసాగుతుంది. అయితే భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారితే మళ్లీ ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం ఇరాన్ నిర్ణయం తాత్కాలికంగా ప్రపంచ చమురు మార్కెట్లకు స్థిరత్వాన్ని తీసుకువచ్చిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18, ప్రతినిధి: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకుని నివాళులర్పించారు. భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా సేవలందించిన ఆయన గొప్ప తత్వవేత్తగా, విద్యావేత్తగా దేశానికి గర్వకారణమని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ ఆసియా పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం మీడియా బ్రీఫింగ్



సందేశం టైమ్స్, జాతీయ డెస్క్, ఏప్రిల్ 18: పశ్చిమ ఆసియా ప్రాంతంలో మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం దేశ పౌరులకు నిరంతరం సమాచారం అందించేందుకు చర్యలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో న్యూఢిల్లీలోని జాతీయ మీడియా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం మీడియా బ్రీఫింగ్ నిర్వహించింది.ఈ సమావేశంలో పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ, పోర్ట్స్, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖ, అలాగే విదేశాంగ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పశ్చిమ ఆసియా పరిణామాల ప్రభావంపై సమీక్షిస్తూ దేశంలో ఇంధన సరఫరా పరిస్థితి, చమురు లభ్యతపై తీసుకుంటున్న చర్యలను వివరించారు.అలాగే సముద్ర మార్గాల్లో నౌకాయాన కార్యకలాపాల భద్రత కోసం చేపడుతున్న ఏర్పాట్లు, ఆ ప్రాంతంలో ఉన్న భారతీయ పౌరులకు అందిస్తున్న సహాయ చర్యలపై కూడా అధికారులు వివరించారు. దేశంలో మొత్తం స్థిరత్వం కొనసాగించేందుకు ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తోందని తెలిపారు.పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు.



## పోషణ పక్వాడ కార్యక్రమంతో తల్లి-బిడ్డ అనుబంధానికి ప్రాధాన్యం

సందేశం టైమ్స్, హుజూర్నగర్, ఏప్రిల్ 18, ప్రతినిధి: స్థానిక శ్రీనగర్ కాలనీ అంగన్వాడి కేంద్రం–8లో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, ఆరోగ్య శాఖల సహకారంతో పోషణ పక్వాడ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సోమమ్మ మాట్లాడుతూ తల్లి-బిడ్డల మధ్య అనుబంధాన్ని పెంపొందించడం, పిల్లల భాషా నైపుణ్యాల అభివృద్ధి ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా తల్లి-బిడ్డ పరస్పర సంభాషణల ప్రదర్శన, తండ్రులు మరియు సంరక్షకుల భాగస్వామ్యం, కథలు చెప్పడం ద్వారా భాషా అభివృద్ధి, మెదడు అభివృద్ధిపై అవగాహన వంటి అంశాలను వివరించారు. పిల్లలకు ఆహారం తినిపించే సమయంలో మాట్లాడటం, ఆటల ద్వారా నేర్పడం, పిక్చర్ కార్డులు, రైమ్స్ వినియోగం వంటి పద్ధతులను సూచించారు. తొలి ఆరేళ్లలో మెదడు అభివృద్ధికి సరైన ప్రేరణ అవసరమని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు షహజాది బేగం, సరళ కుమారి, ఆయా పద్మతో పాటు గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



## మంత్రి ఆదేశాలతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 18, ప్రతినిధి: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట గ్రామంలో సీసీ రోడ్డు పనులకు ముహూర్తం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సర్పంచ్ నరసింహారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకిషన్, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సాయిబాబా, సాయిలు, శ్రీశైలం, నాకులు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కొప్పుల శేషారెడ్డి

సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 18, ప్రతినిధి: ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను పీడీ మాణిక్యం, డీఈ ప్రసన్న, ఇంచార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్, ఏఈ అక్రమ్ కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మాట్లాడిన శేషారెడ్డి ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకిషన్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ అర్హతలపై కొత్త మార్గదర్శకాలు విడుదల

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 18, ప్రతినిధి: ఎంపానెల్డ్ వార్తా పత్రికల అక్రిడిటేషన్ మంజూరుకు సంబంధించి ప్రభుత్వం 'షెడ్యూల్–ఎ' పేరుతో నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో అక్రిడిటేషన్ కార్డుల కేటాయింపును క్రమబద్ధీకరించింది. 2.50 లక్షలకు పైగా సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు రాష్ట్ర స్థాయిలో 12 సి+, 12 ఎంసి+, 2 ఫోటోగ్రాఫర్ కార్డులు, ఢిల్లీ/ఎన్సీఆర్ ప్రాంతానికి ఒక కార్డు, హైదరాబాద్ జిల్లాకు 6 సి+, 6 ఎంసి+, 2 ఫోటోగ్రాఫర్ కార్డులు, ప్రతి మండలానికి ఒక కార్డు కేటాయిస్తారు. 75,001 నుండి 2.50 లక్షల లోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు రాష్ట్ర స్థాయిలో 8 సి+, 8 ఎంసి+, ఒక ఫోటోగ్రాఫర్ కార్డు లభిస్తుంది, మండల కార్డులకు సిఏ (UDIN) సర్టిఫికేట్ అవసరం. 25,001 నుండి 75,000 లోపు ఉన్న పత్రికలకు రాష్ట్ర స్థాయిలో 6 సి+, 6 ఎంసి+, ఒక ఫోటోగ్రాఫర్ కార్డు, జిల్లా కేంద్రాల్లో ఒక సి+, ఒక ఫోటోగ్రాఫర్ కార్డు కేటాయించారు. 15,001 నుండి 25,000 లోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు రాష్ట్ర స్థాయిలో ఒక సి+, ఒక ఫోటోగ్రాఫర్ కార్డు మాత్రమే ఉండగా, మండల స్థాయిలో అత్యధిక సర్క్యులేషన్ ఉన్న ఒక మండలానికి మాత్రమే కార్డు ఇస్తారు. 2,000 నుండి 15,000 లోపు సర్క్యులేషన్ ఉన్న పత్రికలకు రాష్ట్ర మరియు పబ్లిషింగ్ కేంద్ర స్థాయిలలో ఒక్కో కార్డు మాత్రమే మంజూరు చేస్తారు. ఈ మార్గదర్శకాలు పత్రికల ప్రాచుర్యం, పారదర్శకత పెంపు దృష్ట్యా రూపొందించబడినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## పంచాయతీరాజ్ నిబంధనల ప్రకారం గ్రామ పాలన కొనసాగాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్






సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 18, ప్రతినిధి: పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి గ్రామ పాలన కొనసాగాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సర్పంచ్ గ్రామానికి నాయకుడిగా వ్యవహరించాలని, ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సమన్వయంతో సుపరిపాలన అందించాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా గ్రామాల్లో త్రాగునీటి సమస్యలను ముందస్తుగా నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అంగన్వాడీ, జీపి భవనాలు లేని గ్రామాల్లో కొత్త భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిధుల వినియోగంలో అక్రమాలకు తావులేదని, నిర్లక్ష్యం చేస్తే సర్పంచ్‌లు, కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఈఈ మిషన్ భగీరథ సంపత్ కుమార్, గ్రిడ్ డీఈ నాగభూషణం, డీఎల్పీఓలు సాయిబాబు, తిరుపతి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల ఐక్యతతో మెరుగైన వేతన ఒప్పందం సాధ్యం: సిట్యూ



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 18, ప్రతినిధి: కార్మికుల ఐక్యతతోనే మెరుగైన వేతన ఒప్పందాలు సాధ్యమవుతాయని సిట్యూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం తెలిపారు. మెదక్ జిల్లా చేగుంట మండలం చిన్న శివనూరు శివారులోని నియాపోలి పరిశ్రమ కార్మికుల వేతన ఒప్పందంపై సంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో శుక్రవారం సంతకాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ 2026 మార్చి 31తో ముగిసిన పాత ఒప్పందం అనంతరం ఏప్రిల్ 12న యాజమాన్యంతో జరిగిన చర్చల ద్వారా కొత్త ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం కార్మికులకు నెలకు కనిష్టంగా రూ.6000 నుండి గరిష్టంగా రూ.7080 వరకు వేతన పెంపు, నెలకు రూ.30 సర్వీస్ వెయిటేజ్, వి.డి.ఏ రూ.7 నుండి రూ.8కు పెంపు, ముగ్గురు క్యాజువల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా మార్చే అంశాలు పొందుపరిచినట్లు తెలిపారు. జిల్లాలో సాధారణంగా నెలల తరబడి కొనసాగే చర్చలను ఒకే దఫాలో పూర్తి చేసి ఒప్పందం కుదుర్చడం రికార్డుగా పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని, యూనియన్ల ద్వారా పోరాడితేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ ఒప్పందంపై యాజమాన్యం తరపున పరిశ్రమ భాగస్వామి దక్షిత్ మోర్ ప్రతినిధి ఆదర్శ్, యూనియన్ తరపున అధ్యక్షుడు ఏ. మల్లేశం, ప్రధాన కార్యదర్శి కె. నవీన్, ఉపాధ్యక్షుడు మురళి గౌడ్, సహాయ కార్యదర్శి మహేష్, కోశాధికారి శేఖర్, కార్మిక శాఖ తరపున డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి సంతకాలు చేశారు. ఐడీ చట్టం 12(3) ప్రకారం ఈ వేతన ఒప్పందం 2026 ఏప్రిల్ 1 నుండి 2029 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తెలిపారు.

## పాడి గేదెల్ల పథకానికి గడువు పొడిగింపు డీజీపి సౌమ్య మిశ్రకు స్వాగతం





సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 18, ప్రతినిధి: జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 2025–26 వార్షిక ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 2 పాడి గేదెల పెంపకం పథకానికి ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఏప్రిల్ 23 వరకు పొడిగించినట్లు కార్యనిర్వాహక సంచాలకులు తెలిపారు. ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ యువతి, యువకులు https://tgobmms.cgg.gov.in� వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసి సంబంధిత మున్సిపల్ లేదా మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధృవపత్రాలు, పాన్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, అవసరమైతే సడారెం ధృవపత్రం, పాస్‌పోర్ట్ ఫోటో వంటి పత్రాలు అవసరమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్ర జిల్లాకు విచ్చేసిన సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ ఆమెను సూర్యాపేటలోని కృష్ణవేణి పోలీస్ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించి స్వాగతం పలికారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆమెకు అధికారులు ఘన స్వాగతం తెలిపారు.

## రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా






సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 18, ప్రతినిధి: రోడ్డు ప్రమాదాలను తగ్గించి జిల్లాను ప్రమాద రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేటలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన "అరైవ్–అలైవ్" కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా నుంచి రోడ్డు భద్రత ర్యాలీని ప్రారంభించి, పిల్లలమర్రి వద్ద బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలించారు. అనంతరం రుద్రంగి కన్వెన్షన్ హాల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మిశ్రా మాట్లాడుతూ అజాగ్రత్త డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ లేకుండా ప్రయాణించడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తే 50 శాతం వరకు ప్రమాదాలు తగ్గుతాయని పేర్కొన్నారు. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ భద్రతగా గమ్యస్థానాలకు చేరడమే ఈ కార్యక్రమ లక్ష్యమని, జిల్లాలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 45 బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ ప్రజలకు రోడ్డు భద్రతపై విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామాలు, మహిళా సంఘాలు రోడ్డు భద్రతపై తీర్మాన పత్రాలను సమర్పించగా, ప్రమాద సమయంలో సహాయం చేసిన రవీందర్‌ను సన్మానించారు. పోలీసు కళాబృందం నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ పాల్గొన్న వారికి హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీఐజీ శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్టీసీ డీఎం సునీత, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హీమోఫీలియా పై అవగాహనతో ఆరోగ్య రక్షణకు పిలుపు

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 18, ప్రతినిధి: ప్రపంచ హీమోఫీలియా దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకటరమణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హీమోఫీలియా అరుదైన రక్తస్రావ సంబంధిత వంశపారంపర్య వ్యాధి అని, రక్తం గడ్డకట్టేందుకు అవసరమైన క్లాటింగ్ ఫ్యాక్టర్లు లోపం వల్ల ఈ వ్యాధి వస్తుందని తెలిపారు. చిన్న గాయాలకే ఎక్కువసేపు రక్తస్రావం అవడం, సంధుల్లో వాపు, నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో తరచూ రక్తస్రావం జరిగితే ఆరోగ్య కార్యకర్తలు గుర్తించి వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు. సరైన సమయంలో ఫ్యాక్టర్ రీప్లేస్మెంట్ థెరపీ అందిస్తే రోగులు సాధారణ జీవితం గడపగలరని చెప్పారు. బ్లడ్ సెల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అనుమానాస్పద కేసులను గుర్తించి ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు డా. కోటి రత్నం, డా. ప్రసిద్ధ, డా. శ్రీశైలం, సత్తయ్య, శ్రీదేవి, ఉపేందర్ మరియు మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం – పోలీసుల దర్యాప్తు ప్రారంభం

సందేశం టైమ్స్, పటాన్ చెరు, ఏప్రిల్ 18, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందిన కూలీ యాదగిరి భార్య ఇద్దరు పిల్లలు లాస్య, రితిక్‌తో కలిసి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. ఈ నెల 15న యాదగిరి మార్కెట్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో వారు కనిపించకపోవడంతో బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త పటాన్ చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# బ్యారేజీల భద్రతపై ఎన్‌డీఎస్‌ఏతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చలు



సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 18, ప్రతినిధి: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీలో జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) ఛైర్మన్‌తో సమావేశమై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలకు సంబంధించిన పరీక్షలు, పరిశీలనలు మరియు పునరుద్ధరణ చర్యలపై చర్చించారు. బ్యారేజీల భద్రత, మరమ్మతుల పురోగతి, భవిష్యత్ చర్యలపై అధికారులు సమగ్రంగా సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

# లింగాల కమల రాజును మర్యాదపూర్వకంగా కలిసిన యువ నేతలు



సందేశం టైమ్స్, ఖమ్మం, ఏప్రిల్ 18, ప్రతినిధి: ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల రాజును చింతకాని మండల యూత్ విభాగం సోషల్ మీడియా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై చర్చించి తమ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

# అరైవ్–అలైవ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 18, ప్రతినిధి: సూర్యాపేటలోని రుద్రంగి ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన "అరైవ్–అలైవ్" రోడ్ సేఫ్టీ కార్యక్రమంలో జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహతో కలిసి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాయిల సింగారం సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 18, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద బస్‌స్టాప్ దగ్గర తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. కీ.శే. పోతురాజు బాలనర్సయ్య, నర్సమ్మ స్మారకంగా పోతురాజు సుధాకర్ గత 15 సంవత్సరాలుగా వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తూ బాటసారులకు సేవలందిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రులకు వెళ్లే రోగులు, దూరప్రాంతాలకు ప్రయాణించే వారు ఎండ తీవ్రతలో ఇబ్బంది పడకుండా దాహార్తిని తీర్చడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాషా, వీఆర్వో సంతోష్, వార్డు సభ్యులు ఎర్రోళ్ల శంకర్, తుడుం ప్రభాకర్, గ్రామ నాయకులు కుమ్మరి వెంకటేష్, భార్గవచారి, విశాల్ గౌడ్, శ్రీశైలం, సాకలి మురళి, రమేష్, పోచయ్య, గ్రామ పెద్దలు శంకరయ్య, బాలరామ్, యువకులు నాగరాజు, ప్రభాకర్, సాయి, నరేష్ కుమార్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.




# యాసంగి ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్ మాధురి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 18, ప్రతినిధి: జిల్లాలో రబీ–యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీలు, వ్యవసాయ అధికారులు, పీపీసీ, ఐకేపీ సెంటర్ల ఇన్‌చార్జిలు తదితరులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025–26 రబీ సీజన్‌లో జిల్లాకు మొత్తం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రానుందని అంచనా వేసినట్లు తెలిపారు. దొడ్డురకం 2 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం 20 వేల మెట్రిక్ టన్నులు ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం గ్రేడ్–ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, కామన్ రకానికి రూ.2,369, సన్నరకానికి రూ.2,389తో పాటు రూ.500 బోనస్‌తో రూ.2,889 చెల్లించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 226 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు, ఐకేపీ ఆధ్వర్యంలో 97, ప్యాక్స్ ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఉంటుందని వెల్లడించారు. ప్రతి కేంద్రంలో తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, తేమ కొలిచే మీటర్లు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతులకు సీరియల్ నంబర్లు కేటాయించడం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలో ఆలస్యం లేకుండా చూడడం, అకాల వర్షాల సమయంలో ధాన్యాన్ని రక్షించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లకు తరలించాలని, వేసవి దృష్ట్యా రైతులకు తాగునీరు, నీడ, గన్ని బ్యాగులు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పీడీ డీఆర్‌డీఏ జ్యోతి, సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాలికను బాల కార్మికత్వం నుంచి రక్షించి కేసు నమోదు

సందేశం టైమ్స్, అనంతగిరి, ఏప్రిల్ 18, ప్రతినిధి: పాలవరం గ్రామ శివారులోని పంట పొలాల్లో బాతులు మేపుతున్న 7 ఏళ్ల బాలికను స్థానిక యువకులు గుర్తించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించడంతో అధికారులు స్పందించి రక్షించారు. అనంతరం ఐసీడీఎస్, ఐసీపీఎస్, సిహెచ్‌ఎల్ సిబ్బంది బాలికను అనంతగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ జరిపారు. బాలిక తెలిపిన వివరాల ప్రకారం ఆమె తల్లిదండ్రులు సుబ్బయ్య, లక్ష్మి నాలుగేళ్ల క్రితం పాలకుర్తి శ్రీకాంత్ వద్ద ఉంచి వెళ్లిపోయారని, అప్పటి నుంచి అతని ఇంట్లో పనిచేయిస్తూ బాతులు మేపించడం, దుర్వ్యవహారం చేయడం జరుగుతోందని వెల్లడించింది. ఈ ఘటనపై చైల్డ్ ఆఫీసర్ నిమ్మగడ్డ శేషారత్నం, సహాయక కార్మిక అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు పాలకుర్తి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# చంద్రతండాలో ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని వినతి



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 18, ప్రతినిధి: మెదక్ జిల్లా చంద్రతండా గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని స్థానిక యువ నాయకుడు స్రవంతి సర్దార్ జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యంను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గత సంవత్సరం మంజూరైన ఇళ్ల పనులు నిలిచిపోయిన నేపథ్యంలో వాటిని త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటామని పీడీ మాణిక్యం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో జిల్లా డీపీఓ యాదయ్యను కూడా కలిసి ఈ సమస్యను వివరించగా, త్వరలోనే కొత్త కార్యదర్శిని నియమించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని ఆయన సానుకూలంగా స్పందించారు.



## తిరుమలశెట్టి అప్పయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 18, ప్రతినిధి: మఠంపల్లి మండలం రఘునాథపాలెంకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీపీ తిరుమలశెట్టి అప్పయ్య మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తనకు అత్యంత సన్నిహిత మిత్రుడు, ఆప్తుడు అయిన అప్పయ్య మృతి బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఆయన ఎనలేని సేవలు అందించారని, గ్రామశాఖ అధ్యక్షుడు, మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్, మండల పరిషత్ అధ్యక్షుడిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవలందించిన మహానుభావుడని కొనియాడారు. గ్రామాభివృద్ధికి విశేష కృషి చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి నిస్వార్థంగా పనిచేసిన నాయకుడిగా ఆయనను స్మరించుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు.



## బీసీల రాజ్యాధికార లక్ష్యంతో గ్రామాల్లో టీఆర్పీ బలోపేతం

సందేశం టైమ్స్, యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 18, ప్రతినిధి: ఆలేరు నియోజకవర్గం తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజకీయ, సామాజిక న్యాయం జరగాలంటే రాజ్యాధికారం సాధించాల్సిందేనని, గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి వర్గానికీ న్యాయం జరిగేలా టీఆర్పీ ముందుకు సాగుతుందని తెలిపారు. గంధమల్ల వంటి గ్రామాల్లో లభిస్తున్న ఆదరణ రాబోయే రోజుల్లో పెద్ద మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు కొమిరిశెట్టి నర్సింహులు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ విస్తరణకు కృషి చేస్తున్నామని, యువతను, బీసీలను పెద్ద ఎత్తున పార్టీలో చేర్చుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనగా పలువురు యువకులు పార్టీలో చేరి మద్దతు ప్రకటించారు.



## కులగణనపై మల్లన్నకు కృతజ్ఞతగా పాలాభిషేకం – కరీంనగర్‌లో టీఆర్పీ సంబరాలు

సందేశం టైమ్స్, కరీంనగర్, ఏప్రిల్ 18, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన సర్వే నేపథ్యంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌక్ వద్ద పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా ఆధ్వర్యంలో టీఆర్పీ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ కులగణన సాధనకు మల్లన్న చేసిన పోరాటం కీలకమని, కులాల వారీ లెక్కలను ప్రజల ముందుకు తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. బీసీ సమాజం రాజకీయంగా చైతన్యవంతమై రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, మహిళా నాయకులు, ఇతర పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీలిమిటేషన్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు – దక్షిణాది రాష్ట్రాలకు నష్టం ఉండదని స్పష్టం

సందేశం టైమ్స్, జాతీయ డెస్క్, ఏప్రిల్ 18: డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని తెలిపారు.అలాగే తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 స్థానాలు 26కి పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా లోక్‌సభ స్థానాల సంఖ్య పెరుగుతుందని చెప్పారు. జనాభా ఆధారంగా ప్రాతినిధ్యం పెంచే ప్రక్రియలో అన్ని రాష్ట్రాల హక్కులు కాపాడబడతాయని అమిత్‌షా అన్నారు.దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీయకుండా సమతుల్యతతో డీలిమిటేషన్ చేపడతామని కేంద్రం స్పష్టం చేసినట్లు ఆయన వ్యాఖ్యానించారు.

## ఏపీలో మున్సిపల్ కమిషనర్ల భారీ బదిలీలు – పలు కీలక నగరాల్లో కొత్త పోస్టింగులు, తక్షణమే అమల్లోకి ఉత్తర్వులు

సందేశం టైమ్స్, అమరావతి, ఏప్రిల్ 18: రాష్ట్రంలో మున్సిపల్ పరిపాలన విభాగంలో భారీ స్థాయిలో బదిలీలు, కొత్త నియామకాలు చేపడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ జోనల్ కమిషనర్ రమ్య కీర్తనను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేయగా, వినుకొండ మేనేజర్ అర్జునరావును దర్శి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. పులివెందుల ఇన్‌చార్జ్ కమిషనర్ మునికుమార్‌కు రెగ్యులర్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించారు. విజయవాడ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను వుయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇవ్వగా, వుయ్యూరు కమిషనర్ జె. రామారావును తెనాలి అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. విశాఖ జీఎంసీ దక్షిణ జోన్ జోనల్ కమిషనర్‌గా పీవీవీడీ ప్రసాద్ రావును నియమించగా, గుంటూరు కార్పొరేషన్ అదనపు కమిషనర్ మల్లయ్య నాయుడును బదిలీ చేశారు. ఒబులేసును కర్నూలు కమిషనర్‌గా నియమించగా, విశ్వనాథ్‌ను తదుపరి పోస్టింగ్ కోసం సిడిఎంఏ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే తిరుపతి, గుంటూరు, కర్నూలు ప్రాంతాల్లో పలువురు అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించగా, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పలువురు అధికారులకు కీలక నియామకాలు లభించాయి.



## ఉద్యోగుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి – టీజీ జేఏసీ సందీప్ పులిజ్వాల

సందేశం టైమ్స్, మహబూబ్‌నగర్ జిల్లా, ఏప్రిల్ 18: ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయీస్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ ట్రాన్సాక్షన్ కమిటీ నాయకులు సందీప్ పులిజ్వాల ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 2 నాటికి పీఆర్‌సీ అమలు, పెండింగ్ డీఏ విడుదల, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసత్వ సమస్య పరిష్కారం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్ రావుకు టీజీ జేఏసీ తరఫున వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీజీ జేఏసీ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సందీప్ పులిజ్వాల, జిపిఓ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జోగిపేట సబ్ జైల్ ట్రాన్సిట్ హోం పనుల పరిశీలన, అలాగే అందోల్‌కు సింగూర్ నీటి విడుదలపై మాజీ ఎమ్మెల్యే వినతి





సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 18: సంగారెడ్డి జిల్లా జోగిపేట సబ్ జైల్‌లో ఏర్పాటు చేస్తున్న ట్రాన్సిట్ హోం (విదేశీయుల కేంద్రం) నిర్మాణ పనులను ఐజీ ఎం. శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేస్తూ నిర్మాణ పనులు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ట్రాన్సిట్ హోంను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, డీసీపీ కృష్ణ చైతన్య, డీఎస్పీ సత్తయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.ఇదే రోజు అందోల్ నియోజకవర్గ రైతుల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సింగూర్ ప్రాజెక్టు నుండి నీటి అసమాన పంపిణీ వల్ల అందోల్ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. లెఫ్ట్ కాలువకు నీరు విడుదల చేయకపోవడం, దిగువ ప్రాంతాలకు మాత్రమే సాగునీరు అందించడం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. సింగూర్ డ్యామ్ మరమ్మతుల పేరుతో ఆలస్యం జరుగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ముందస్తు సమాచారం లేకుండా నీటి విడుదలతో పలు గ్రామాల్లో పంట నష్టం జరిగిందని, బాధిత రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదని విమర్శించారు. రైతులకు క్రాప్ హాలిడే లేదా తగిన పరిహారం అందించడంతో పాటు సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అమావాస్య సేవలు, రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం – సంగారెడ్డి జిల్లాలో విభిన్న కార్యక్రమాలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 18: జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని బంగ్లా మీర్జాపూర్ గ్రామంలో అమావాస్య సందర్భంగా శ్రీ శ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 7:30 వరకు నిరంతరం ప్రజల సమస్యలను ఆలకిస్తూ పరిష్కారాలు సూచించడంతో గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సేవ చేస్తున్నారని గ్రామస్తులు ప్రశంసించగా, ప్రజల నమ్మకమే తనకు బలమని జయమ్మ మాతాజీ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం 9392856819 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.ఇదే సమయంలో వట్టిపల్లి మండల కేంద్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా, ఎస్ఐ లవ కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని, లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ వినియోగం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు మరియు వాహనదారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.